
ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.8 కనిష్ఠం 18.6



కామారెడ్డి జిల్లా వార్తలు

5

మంగళవారం 30 జనవరి 2024

3న జిల్లా స్థాయి సబ్‌జూనియర్స్ సెలక్షన్స్

కామారెడ్డిటౌన్, జనవరి 29: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 9వ జిల్లాస్థాయి సబ్‌జూనియర్స్ సెలక్షన్స్‌ను ఫిబ్రవరి 3న కామారెడ్డిలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-8 బాల బాలికలకు 50, 300 మీటర్స్ స్టాండింగ్ బ్రాడ్ జంప్, అండర్ -10 బాల బాలికలకు 100, 300 లాంగ్ జంప్, అండర్ -12 బాల బాలికలకు 100, 400, 600 లాంగ్ జంప్, షాట్‌పుట్, అండర్-14 బాల బాలికలకు 100, 400 మీటర్స్ రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

- పెండింగ్ బిల్లులపై సర్పంచ్‌ల్లో ఆందోళన
- బిల్లులు వస్తాయో.. రావోనంటూ తర్జనభర్జన
- మిగిలింది రెండు రోజులే..
- ఫ్రీజింగ్‌లో జనరల్ ఫండ్
- నేడో, రేపో 'ప్రత్యేక' పాలనకు జీవో





పెండింగ్ బిల్లులు.. ఇంకెప్పుడు!?

కామారెడ్డి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల్లో ఆందోళన నెలకొంది. ఐదేళ్ల కాలంలో ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులపై పెండింగ్ బిల్లులు వస్తాయో లేవోనని సర్పంచ్‌లు తర్జనభర్జన పడుతున్నారు. మరో రెండు రోజులు అయితే సర్పంచ్‌లు మాజీ అవుతారు. ప్రత్యేకాధికారులుగా నేడో, రేపో ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో రికార్డులన్నీ ప్రత్యేక అధికారుల చేతిలోకి వెళ్లనున్నాయి. గడువు దాటితే చెక్‌ల వ్యాలిడిటీ పూర్తవుతోంది. రకరకాల సాంకేతిక సమస్యలను ముందుముందు ఎదుర్కోవాల్సి వస్తుందని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రెజరీలలో చేసిన పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పదవిలో ఉన్నప్పుడే బిల్లులు ఇవ్వడం లేదు. పదవి పోయాకవస్తాయో రావోనంటూ సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు.

ఫ్రీజింగ్‌లో జనరల్ ఫండ్

గ్రామ పంచాయతీకి పన్నుల రూపేనా వచ్చే డబ్బులను జనరల్ ఫండ్ కింద జమ చేసిన కూడా ఆ నిధులపై మూడు నాలుగు నెలల నుంచి ఫ్రీజింగ్ కొనసాగుతుంది. రూ. కోట్లలో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ కూలీ పనుల ఆధారంగా జనరేటు అయ్యే 40 శాతం నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, మురుగు కాలువలు, పునాదుల అభివృద్ధి, గ్రామపంచాయతీ కార్యాలయాల భవన నిర్మాణం,పనుల బిల్లులు సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ట్రెజరీలో జమ చేస్తున్న జనరల్ ఫండ్‌తో చేపట్టిన పనుల బిల్లులు కూడా పాస్ కావడం లేదని సర్పంచ్‌లు వాపోతున్నారు. అప్పులు తెచ్చిమరీ పనులు చేశామని ఇప్పటికి చేసిన పనులకు బిల్లులు మంజూరు గాక మంజూరుకాక వడ్డీలు పెరిగిపోతూ అవస్థలు పడుతున్నామని పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వం ఒత్తిడితో పనులు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి సర్పంచ్‌ల చేత పనులు చేయించింది. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించింది. చేయకపోతే అప్పట్లో పలువురు సర్పంచ్‌లకు నోటీసులు ఇచ్చి మరి పనులు చేయించారు. బిల్లులేమో నెలల తరబడి పెండింగ్‌లో పెట్టారు.ఈ బిల్లులు ఆర్థిక సంవత్సరం ముగిస్తే వస్తాయో రావో అనే టెన్షన్‌లో సర్పంచ్‌లు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 526 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వైకుంఠధామాలు, క్రీడప్రాంగణాలు, రైతు వేదికలు, సీసీరోడ్లు, అంతర్గత రహదారులు తదితర పనులు చేయించేందుకు అప్పులు చేశారు. ఈనెల 28న రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులు త్వరలో విడుదల చేస్తామని ప్రకటించిన విషయం విధితమే. అయిన పక్షం రోజులుగడుస్తున్న ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని ట్రెజరీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గత ఏడాది గ్రామ పంచాయతీలకు కేంద్రం విడుదల చేసిన నిధులను సైతం గత ప్రభుత్వం దారి మళ్లించిన సంగతి తెలిసిందే. మంగళవారం లోపు ప్రభుత్వం నిధులు విడుదలచేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు. దీనిపై సర్కారు ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

నేడో, రేడో ప్రత్యేక పాలనపై జీవో

పంచాయతీలో ప్రత్యేక పాలనపై ప్రభుత్వం నేడో, రేపో జీవో జారీచేసే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రంలో 2019 జనవరిలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. 2024 ఫిబ్రవరి 1తో పంచాయతీ పాలక వర్గాల కాలపరిమితి పూర్తికానుంది. నిబంధనల ప్రకారం 15 రోజుల ముందుగానే ఎన్నికల తతంగం అంతా పూర్తి కావాలి. అయితే జనవరిలోనే ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. పైగా మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం ఇంత తొందరగా గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్లే ఆలోచనలో లేన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరంగా ఉంది. గ్రామాలలో పార్టీ అంత పటిష్టంగా లేదు. ఈ పరిస్థితుల్లో పథకాల అమలు, పార్లమెంట్ ఎన్నికలు పూర్తి చేసుకోవడం ద్వారా గ్రామాల్లోనూ పార్టీ శ్రేణులకు బలం చేకూర్చ వచ్చని ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.





విన‌తులను స్వీకరిస్తున్న డీఆర్‌డీవో పీడీ సాయన్న

ప్రజావాణికి 68 ఫిర్యాదులు

కామారెడ్డిటౌన్, జనవరి 29: కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 68 ఫిర్యాదులు వచ్చినట్లు డీఆర్‌డీవో పీడీ సాయన్న తెలిపారు. రెవెన్యూ శాఖకు 38, ఉపాధి కల్పన కార్యాలయానికి 3, జిల్లా పంచాయతీ కార్యాలయానికి 11, ఎస్పీ కార్యాలయం 4, మున్సిపల్ కార్యాలయానికి 2, జిల్లా ఉపాధి కల్పన, గిరిజన సంక్షేమానికి 3 చొప్పున, గృహ నిర్మాణం, లీడ్‌బ్యాంక్, పరిశ్రమల, ఎక్సైజ్, ఐసీడీఎస్‌కు ఒకటో చొప్పున దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కాగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాష్ట్రవ్యాప్తంగా స్కాలర్‌షిప్, ఫీజురియింబర్స్‌మెంట్ సుమారు 7వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉందని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత మూడేళ్లుగా రావాల్సిన రియింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు ఇబ్బందులకు పడుతున్నారని, వెంటనే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరల కనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, పెండింగ్‌లో ఉన్న చార్జీలను విడుదల చేయాలని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలుచేయాలని అన్నారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం అగ్రికల్చర్ యూనివర్సిటీలో హైకోర్టు నిర్మాణం కోసం భూమిని కేటాయిస్తూ జీవో55 ఇవ్వడం సరైందికాదని, వెంటనే ఆ జీవోను వెనక్కి తీసుకుని హైకోర్టు నిర్మాణాన్ని వేరే ప్రాంతాల్లోకి మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏవో మసూర్ అహ్మద్, సూపరింటెండెంట్ సాయి భుజంగరావు పాల్గొన్నారు.



వినతిని స్వీకరిస్తున్న సూరింటెండెంట్





- ముందస్తుగానే ఎన్నికల కోసం సిద్ధమవుతున్న ప్రధాన పార్టీల నేతలు
- సిట్టింగ్‌కే అవకాశం ఉండడంతో పార్లమెంట్ పరిధిలో పర్యటిస్తున్న ఎంపీ అర్వింద్
- అభ్యర్థుల ఎంపికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు

నిజామాబాద్ పార్లమెంట్‌పై ప్రధాన పార్టీల నజర్ !

నిజామాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పార్లమెంట్‌పై బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు ప్రత్యేక దృష్టిపెట్టారు. వచ్చే నెలలో పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుండడంతో ముందస్తుగానే మూడు పార్టీల నేతలు సిద్ధమవుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమీక్ష సమావేశాలను నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్నారు. సమన్వయంతో ఎన్నికలను ఎదుర్కొనే విధంగా ఇప్పటినుంచే ప్రయత్నాలను చేస్తున్నారు. బీజేపీ తరపున అభ్యర్థి పోటీ విషయంలో స్పష్టత ఉన్నా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థుల విషయంలో ఇంకా నిర్ణయం కాలేదు. ఈ రెండు పార్టీల నేతలు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఉన్న సామాజిక వర్గాల బలాబలాలను పరిశీలిస్తూ బలమైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు సిద్ధమవుతున్నారు. తమకు సంబంధించిన సంస్థల ద్వారా సర్వేలు నిర్వహిస్తూ అభ్యర్థులను ఖరారుచేసే ప్రయత్నంలో ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికలు రాష్ట్రంలోని మూడుపార్టీలకు కీలకం కావడం ప్రతీ నియోజకవర్గాన్ని గెలుచుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండడంతో నిజామాబాద్ పార్లమెంట్‌పైన కూడా ప్రత్యేక దృష్టిపెట్టి అభ్యర్థుల ఎంపికపైన కసరత్తు చేస్తున్నారు.

నిజామాబాద్‌లో త్రిముఖ పోరు

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఈ దఫా త్రిముఖ పోటీ నెలకొననుంది. శాసనసభ ఎన్నికల్లో మూడుపార్టీలకు మంచి ఫలితాలే వచ్చాయి. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ గెలుచుకోగా బోధన్, నిజామాబాద్ నియోజకవర్గాలను కాంగ్రెస్, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ నియోజకవర్గాలను బీజేపీ గెలుచుకుంది. ఈ దఫా శాసనసభ ఎన్నికల్లో మూడు పార్టీలకు పార్లమెంట్ పరిధిలోని ఓటర్లు పట్టంకట్టారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఏడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నా అప్పుడు బీజేపీనే ఈ సీటును కైవసం చేసుకుంది. అప్పటి సీఎం కూతురు కవితను ఓడించడంతోపాటు పట్టులేని నియోజకవర్గంలో బీజేపీ విజయం సాధించింది. ఈ దఫా ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండడం, మిగతా ఐదు నియోజకవర్గాల్లో డిపాజిట్లు సాధించడంతోపాటు పోటాపోటీగా ఓట్లు రావడంతో మరో దఫా సిట్టింగ్‌ను నిలుపుకునేందుకు ఆ పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పార్లమెంట్ స్థాయిలో సమీక్ష సమావేశాలను నిర్వహించిన పార్టీ నేతలు పోటీకోసం బూత్‌లెవల్‌పై నజర్‌పెట్టారు. అన్ని బూత్‌లకు ప్రత్యేకంగా ఇంచార్జిలను నియమించడంతో పాటు కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. సిట్టింగ్ ఎంపీ అర్వింద్ కూడా గడిచిన రెండు నెలలుగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. శాసనసభ ఎన్నికల్లో కోరుట్ల నుంచి పోటీచేసి ఓటమిపాలైన ఆయన ఈదఫా పార్లమెంట్‌లో సిట్టింగ్‌ను దక్కించుకునేందుకు గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు. కొంతమంది సీనియర్ నేతలు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నా అధిష్ఠానం ఆయన వైపే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ ముమ్మర ప్రయత్నాలు

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు ఈ దఫా మెజార్టీ సీట్లను సాధించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. నిజామాబాద్ నుంచి కూడా బలమైన అభ్యర్థిని బరిలోకి దించేందుకు సిద్ధమవుతున్నారు. పార్లమెంట్ పరిధిలో రైతులే ఎక్కువగా ఉండడం, శాసనసభ ఎన్నికల్లో రెండు స్థానాలను గెలుచుకోవడంతోపాటు మిగతా నియోజకవర్గాల్లో రెండోస్థానంలో ఉండడంతో తమకు కలిసివస్తుందని భావిస్తున్నారు. గత ఎన్నికల్లో మాజీ ఎంపీ మధుయాష్కీ పోటీ పడగా ఈదఫా ఆయన దూరంగా ఉండడంతో ఇతర నేతలను దించేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాకు చెందిన సినీ నిర్మాత దిల్‌రాజుతో పాటు ఇతర నేతల బయోడెటాను పరిశీలిస్తున్నారు. రెండు రోజుల్లో జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకుని పంపించేందుకు సిద్ధం అవుతున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ నుంచి పోటీకి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మాజీ విప్ ఈరవత్రి అనిల్, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హుందాన్, మాజీ ఎమ్మెల్సీ అర్కెల నర్సారెడ్డితోపాటు బాల్కొండ నుంచి పోటీచేసిన సునీల్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. రెడ్డిసామాజిక వర్గంతోపాటు బీసీ నుంచి మున్నూరుకాపు, పద్మశాలి అభ్యర్థులను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

బీఆర్ఎస్ ప్రత్యేక వ్యూహాలు

నిజామాబాద్ పార్లమెంట్ స్థానాన్ని గెలుపొందేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోంది. గతంలో చేజార్చుకున్న సీటును గెలుపొందేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే కేటీఆర్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. పార్లమెంట్ పరిధిలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండడం రెండు నియోజకవర్గాల్లో రెండోస్థానంలో అభ్యర్థులు ఉండడంతో ఎలాగైనా దక్కించుకు నేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. బోధన్, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్‌లో పార్టీకి ఎమ్మెల్యే లేకపోవడంతో ఎంపీని గెలిపించుకుంటే తమకు కలిసివస్తుందని భావిస్తున్నారు. పార్లమెంట్ నుంచి గతంలో పోటీచేసిన ఎమ్మెల్సీ కవితవైపే ఎక్కువమంది మొగ్గుచూపుతున్నారు. ఆమె గతంలో తానే పోటీ చేస్తానని ప్రకటించారు. గడిచిన నెలరోజులుగా ఆమె వైఖరి బయటపడకపోవడంతో పోటీచేస్తుందా లేదా అని చర్చ సాగుతోంది. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేగా రెండు దఫాలు గెలిచి గత ఎన్నికల్లో ఓడిపోయిన బాజిరెడ్డి గోవర్ధన్‌ను బరిలోకి దించే అవకాశం ఉన్నట్లు విన్పిస్తోంది. ఆయనతోపాటు నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త, ఆయన సోదరుడు మహేష్ బిగాల అభ్యర్థిత్వాలను కూడా అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మూడు పార్టీల నేతలు ముందే పార్లమెంట్‌పై దృష్టి పెట్టడంతో ఈ దఫా గట్టి పోటీ కన్పిస్తోంది.

వరి పంట సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలి

- ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త అనిల్‌కుమార్



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, అధికారులు

భిక్కనూరు, జనవరి 29: రైతులు వరిపంట సాగులో జాగ్రత్తలు పాటించాలని మాల్తుమ్మెద ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త అనిల్‌కుమార్, జిల్లా వ్యవసాయాదికారిని భాగ్యలక్ష్మీ సూచించారు. సోమవారం మండలంలోని తిప్పాపూర్, భిక్కనూర్ గ్రామాల్లో వరి, కూరగాయాల పంటలు, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రధానంగా యాసంగి సీజన్‌లో వరి, మొక్కజొన్న, శనగ, కూరగాయ పంటలను సాగు చేస్తున్నారని అన్నారు. వరి పంటలో అక్కడక్కడ కాండం తొల్చు పురుగు గమనించినట్లు చెప్పారు. నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి 8-10 కిలోలు లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 7-8 కిలోలు ఇసుకలో సమానంగా కలిపి సాయంత్రం వేళల్లో చల్లుకోవాలని, పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే కార్టప్ హైడ్రోక్లోరైడ్ అనే మందును 2 గ్రాములకు ఒకలీటర్ నీటికి కలిపి పొలం అంతా సమానంగా పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో రాధ, ఏఈవోలు రవి, వినోద్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

జంతువుల పట్ల ప్రేమ చూపాలి: కలెక్టర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, జనవరి29: భూమిపై మనుషులతోపాటు జీవనం సాగిస్తున్న జంతువుల పట్ల ప్రేమ, దయ, కరుణ చూపాలని కలెక్ట ర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జంతు సంక్షేమ పక్షోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువులను హింసించొద్దని, జంతు హింస నివారణ, జంతు సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి సింహారావు, జిల్లా రవాణాధికారి వాణి, ఐసీడీఎస్ పీడీ బావయ్య, పశుసంవర్ధకశాఖ అధికారులు రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

- నాందేడ్ నుంచి గంజాయి తెచ్చిన యువకులు
- కామారెడ్డిలో రైల్వేస్టేషన్‌లో పట్టుకున్న పోలీసులు

కామారెడ్డి టౌన్, జనవరి 29: గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో గంజాయి సప్లయ్‌చేస్తున్న ముగ్గురు యువకులను అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కామారెడ్డి పట్టణానికి చెందిన నినావత్ గణేష్, వరియోగుల సాయి అనే యువకులు నాందేడ్‌కు వెళ్లి అక్కడ ఆరీఫ్ అనే వ్యక్తితో గంజాయి విషయంలో మాట్లాడుకుని ముగ్గురు కలిసి దాదాపుగా 300 గ్రాముల గంజాయిని తీసుకుని వస్తుండగా కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో పట్టుకున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు తమ పిల్లలు గాని, మీ చుట్టు పక్కల వారు గాని గంజాయి తాగడానికి అలవాటుపడి ఉంటే వారిపై ప్రత్యేక శ్రద్ధ మాన్పించే విధంగా ప్రయత్నించాలసీ ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. అంతేకాకుండా అలాంటి పనులు చేసేవారు ఎవరైనా దృష్టిలో ఉన్నట్లయితే వారి వివరాలను తమకు తెలియజేయాలని, వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చి గంజాయిని మాన్పించే విధంగా చేస్తామని, సప్లయ్ చేసేవారిని అరెస్ట్ చేసి జైలుకు పంపుతామని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.



పోలీసుల అదుపులో నిందితులు

'కాలనీ సమస్యలు పరిష్కరించాలి'

నిజామాబాద్ రూరల్, జనవరి 29: జిల్లాకేంద్రంలోని 3వ డివిజన్ పరిధిలోని గంగాస్థాన్ ఫేజ్-2 కాలనీవాసులు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని కలిశారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలసి వినతిపత్రం ఇచ్చారు. గంగాస్థాన్ ఫేజ్-2లో మురుగు కాల్వలు సరిగాలేక మురిగినీరు రోడ్డుమీదనే పారుతోందని, గంగాస్థాన్ వాసులకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరా జరగడం లేదని, కాలనీలో ఏర్పాటు చేసిన పార్కులో సరియైన వసతులు కల్పించాలని, వాకింగ్ ట్రాక్ నిర్మించాలని కోరారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల అందజేత

పెద్దబజార్, జనవరి 29: మహిళ శిశు, దివ్యాంగులు,వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత సహాయ ఉపకారణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారయణగుప్త అన్నారు. సోమవారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందచేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయని, అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సీడీపీవో సౌందర్య, బీజేపీ నాయకులున్నారు.

ఇండోర్ స్టేడియానికి రూ.50వేల విరాళం

ముప్కాల్, జనవరి 29: మండల కేంద్రంలో నిర్మితమవుతున్న ఇండోర్ స్టేడియంకు చింతకింది ఉదయ్‌కిరణ్‌రెడ్డి తనవంతుగా రూ.50వేల ఆర్థిక సహాయం చేసినట్లు వీడీ రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం ముప్కాల్ స్కాట్ క్రీడా మైదానంలో ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉదయ్‌కిరణ్‌రెడ్డిని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

మాయమాటలతో బంగారం అపహరణ

డిచ్‌పల్లి,జనవరి 29: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘన్‌పూర్ గ్రామంలో గల చైతన్యనగర్ కాలనీలో సోమవారం సాయంత్రం కాలనీకి చెందిన ఓటరుకారు చైతన్య అనే యువతికి పల్సర్ బైకుపై వచ్చిన ఓగుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌లో మీకు ఆఫర్ వచ్చిందని, ఓటీపీ చెప్పమని అడిగాడు. దీంతో యువతి తనకు ఫోన్‌లేదు అని తెలిపింది. దీంతో యువతిని మోటారు బైకుపై వెళ్దాం, ఇంట్లోని బంగారం తీసుకొని రావాలని సూచించాడు. సదరు యువతి మోసపోయి బంగారం తీసుకొని దుండగుడి బైకుపై ఘన్‌పూర్ రైల్వే గేటు పడగానే రిటర్న్ వచ్చి ఇస్లాంపూర కాలనీలో వేరే ఇంట్లోకి వెళ్లి వచ్చి ఈ ఇళ్లుమాదే అని మోసాపూరిత మాటలు చెప్పి ఆమె వద్ద ఉన్న తులంన్నర బంగారం చోరీ చేసినట్లు యువతి డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిందని ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు. అయితే, దుండగుడు బైకుపై యువతిని తీసుకెళ్తున్న వీడియో సీసీ కెమెరాలో రికార్డు కావడంతో వైరల్ అయ్యింది.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

మాక్లూర్, జనవరి 29: మండలానికి చెందిన సర్పంచ్‌తో పాటు పలువురు విండో డైరెక్టర్‌లు సోమవారం బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేశారు. మండలంలోని ఒడ్యాట్ గ్రామసర్పంచ్ సుధా రాజేశ్వర్, విండో డైరెక్టర్‌లు బురోల్ల అశోక్, శేఖర్, గంగాధర్, సోమల అశోక్, స్వర్ణ మంజులతో పాటు వార్డుమెంబర్ చింతల మోహన్, జనార్ధన్, గణపతిలు పార్టీలో చేరగా వారికి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంగాధర్‌గౌడ్, దయాకర్‌రావు, రాజేశ్వర్, లచ్చారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్‌గా కస్తూర్బా విద్యార్థులు

ముప్కాల్, జనవరి 29: జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీలో ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా ముప్కాల్ కస్తూర్బ విద్యార్థులు నిలిచారని కస్తూర్బా గాంధీ పాఠశాల స్పెషల్ వినోద తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీలో అండర్-12 కటస్‌లో విభాగంలో మహేశ్వరి, ఆర్.హర్షవర్ధిని, జి.రష్మిత, శృతకీర్తి, శాలిని గోల్డ్ మెడల్ సాధించారు. రెండవ విభాగంలో అండర్-12 ఎస్.శివనందిని, జి.అఖిల, ఎన్.దివ్యశ్రీ, సీహెచ్.అష్మిత, ఎస్.ఆరాధ్య, వనస్వీని సిల్వర్‌మెడల్ సాధించారు. సి.రష్మిత, యు.వర్ష, టి.సదిని, ఎస్.రూప, వి.శ్రీనిత్య బ్రాంచ్ మెడల్ సాధించారు. ఓవరల్ చాంపియన్‌షిప్ కప్పును ముప్కాల్ కేజీవీబీ పాఠశాలకు లభించడం పాఠశాల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. వీరిని టస్కో ఇండియా సీస్ సత్య, శంకర్, సంతోష్, మాస్టర్ శ్రీకాంత్, టోర్నమెంట్ ఆర్గనైజేషన్ కె.రవిలు అభినందించారు.

సిద్దులగుట్ట ఆలయంలో ప్రత్యేక పూజలు

పెర్కిట్, జనవరి 29: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ పొద్దుటూరి వినయ్‌రెడ్డి సిద్దేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో పల్లకీ సేవలో భక్తులు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాల్ల సాయిరెడ్డి, శ్రవణ్‌రెడ్డి, జీవన్, ముక్కెర విజయ్, పూల నర్సయ్య, ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, గంగాకిషన్, బోండ్ల ఆనంద్, నక్కల లక్ష్మణ్, అయ్యప్ప శ్రీనివాస్, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

నిజామాబాద్ అర్బన్, జనవరి 29: ఏబీవీపీ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 19, 20వ తేదీల్లో నిర్వహించిన యువజన వారోత్సవాల క్రీడపోటీల విజేతలకు సోమవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారయణగుప్త బహూమతులు అందజేశారు. నగరంలోని న్యూఅంబేడ్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ పోటీలల్లో గెలుపొందిన విద్యార్థులకు బహూమతులు అందజేశారు. విద్యార్థి దశ నుంచే గెలుపోటములు అలవాటు చేస్తూ గెలిచిన వారు మరింత ముందుకు వెళ్తూ ఓడిన వారు గెలువడానికి ప్రయత్నం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు రెంజర్ల నరేష్, విభాగ్ సంఘటన కార్యదర్శి రాజుసాగర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోజ్, జిల్లా కన్వీనర్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష ఫీజు గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్, జనవరి 29: వచ్చే మార్చి 2024లో జరిగే పదవ తరగతి వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులకు తత్కాల్‌స్కీమ్ ఫీజు గడువును ఫిబ్రవరి 6వ తేది వరకు పొడగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వి.దుర్గాప్రసాద్ తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు నమోదు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే మార్చిలో జరిగే వార్షిక పరీక్షకు, ఆ తర్వాత జరిగే సప్లమెంటరీ పరీక్షలకు అర్హులకు కావున పదవతరగతి వార్షిక పరీక్షలు రాసే రెగ్యులర్, ఒకసారి ఫేల్ అయిన వారికి పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఇదే చివరి అవకాశమని ఆయన తెలిపారు.

జక్రాన్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం వాయిదా

జక్రాన్‌పల్లి, జనవరి29:మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ కుంచాల విమల అధ్యక్షతన జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపీడీవో బ్రహ్మానందం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మండల సర్వసభ్య సమావేశాన్ని ఫిబ్రవరి 6వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

టీయూ ఇన్‌చార్జ్ వీసీని కలిసిన అసిస్టెంట్ రిజిస్ట్రార్

డిచ్‌పల్లి,జనవరి29: తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ బుర్ర వెంకటేశం (ఐఏఎస్)ను సోమవారం వర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్, సాయాగౌడ్ హైదరాబాద్ కలిశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ పలు విభాగాల్లో వివరాలను ఇన్‌చార్జి వీసీ అడిగి తెలుసుకున్నారని సాయాగౌడ్ తెలిపారు.

టీయూలో బాలికల హాస్టల్ నిర్మాణం ఎప్పుడు!?

●టీయూలో బాలికలకు వసతి కరువు ● ఇరుకుగా మారిన హాస్టల్ వసతి 300మందికి సరేపోయే భవనంలో 500మంది విద్యార్థులు ● ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు


టీయూ బాలికల హాస్టల్ ఇదే ..

డిచ్‌పల్లి, జనవరి 29: రాష్ట్ర అవతరణకు ముందే ప్రత్యేక తెలంగాణరాష్ట్రం పేరుతో ఉన్న ఏకైక యూనివర్సిటీ ఈ డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీ. ఇంత ఘనమైన పేరున్న ఈ విశ్వవిద్యాలయంలో బాలికలకు తీవ్రమైన వసతి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రం అవతరించి 10ఏళ్లు గడిచిన వర్సిటీలో బాలిక వసతి సమస్య నేటికి తీరడం లేదు ఎన్నో సార్లు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు,రాష్ట్ర గవర్నర్‌కు వినతి పత్రాలు విద్యార్థులు అందించిన సమస్య పరిష్కరం కావడం లేదు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థినులు ఇక్కడికి పీజీ, ఉన్నత చదువుల కోసం వస్తుంటారు. గత 5సంవత్సరాల కాలంగా ఈ హాస్టల్ సమస్య తీవ్రంగా వేధిస్తున్న ప్రభుత్వ, పెద్దలు, ఉన్నత విద్యామండలి స్పందించకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పీజీ కోర్సుల్లో అన్ని విభాగాల్లో విద్యార్థినులే అధిక శాతం సీట్లు 100శాతం సీట్లలో 72మంది విద్యార్థినులే సీట్లు సాధిస్తున్నారు. దీంతో వర్సిటీలోని బాలికల హాస్టల్‌లోని ఒక్కో గదిలో 5నుంచి 6గురు ఉండాల్సి ఉండగా 10 నుంచి 15 మంది సర్దుబాటు చేసుకుంటున్నారు.తెలంగాణ యూనివర్సిటీలో 1851మంది విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరగా 1226మంది బాలకలు పీజీ కోర్సులో ప్రవేశం పొందారు.గతంలో ఏన్నడు లేని విధంగా పీజీ కోర్సుల్లో బాలికలు ఎక్కువగా చేరుతుండటంతో హాస్టల్ అకామిడేషన్ ఇబ్బందిగా మారుతోంది. దీంతో యూనివర్సిటీ అధికారులు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులో చేరే విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించకుండా ఒత్తిడిని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. గత పదేళ్ల క్రితం 300 మంది కోసం కట్టిన బాలికల హాస్టల్‌లో ప్రస్తుతం 500మంది ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కెమిస్ట్రీ, తెలుగు, ఇతర డిపార్టుమెంట్‌లలో 30 నుంచి 60 సీట్లకు పెంచిన హాస్టల్ వసతి మాత్రం పెంచడం లేదని దీంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని విద్యార్థినులు వాపోతున్నారు. ఇటీవల విశ్వవిద్యాలయానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సందర్శించి సమయంలో విద్యార్థులు బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని ఆమెకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే సమస్య పరిష్కరించేందుకు స్వయంగా హాస్టల్ సందర్శించిన గవర్నర్ హామీ ఇచ్చి 6నెలలు గడిచిన ఇంత వరకు హాస్టల్ వసతి నిర్మాణానికి చిలిగవ్వ కూడా మంజూరు కాకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. జిల్లా శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు వసతి గృహం ఏర్పాటు పట్ల ప్రత్యేక చొరవ చూపాలని విద్యార్థినులు కోరుతున్నారు.


టీయూ స్వాగత తోరణం


టీయూ కళాశాల భవనం

కల్యాణలక్ష్మి ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా చూడాలి

● పెండింగ్ పనులు, పథకాలపై ఆరా ● ప్రజాప్రతినిధులకు సూచించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, జనవరి29: కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా చూడాలని ఎప్పటి క్లీయర్ చేయాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సూచించారు. సోమవారం బాల్కొండ ఎమ్మెల్యే నియోజకవర్గ పథకాల తీరుపై నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, అధికారులతో తన క్యాంప్ కార్యాలయంలో ఆయన నియోజకవర్గ అధికారులు ఆర్డీవో, డీఎల్‌పీవో, తహసీల్దార్, ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు,ఎంపీపీ, జడ్పీటీసీలతో సమీక్ష సమావేశం నిర్వ హిం చారు. ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులపై, పెండింగ్ పనులపై నియో జకవర్గ సమస్యల పరిష్కారానికి బాధ్యత తీసుకొని కృషి చేయాలని సూచించారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులపై ఆరా తీశారు. నియో జకవర్గంలో సుమారు 9500దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలి పారు. ఇందులో కొత్త రేషన్‌కార్డుల కోసం 20వేల మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. పాత కార్డులలో పేర్ల మార్పు కోసం మరో నాలుగు వేల మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. ఈ దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని అధికారులను అడిగితెలుసు కున్నారు. ధరణి అమలు తీరుపై చర్చించారు. క్లీయర్‌గా ఉన్న టైటిల్‌ను వెంటనే పరిష్కరించాలని, కలెక్టర్ వద్ద గాని సీసీఎల్‌ఏలో పెండింగ్‌లో ఉన్న క్లీయర్ కానీ ఫైళ్లు తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కా రానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. మండలాల వారీగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా కొనసాగుతున్న ఉపాధి హామీ పురోగతిపై అధికా రులను ఆయన అడిగితెలుసుకున్నారు. పనులు లక్ష్యాన్ని చేరుకుం టు న్నామా? లేదా అని అధికారులను అడిగితెలుసుకుంటున్నారు. వెంటనే ఉపాధి హామీ పనులు వేగవంతంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వినోద్‌కుమార్, ఆయా మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రూరల్ క్వారీల్లో తనిఖీలు

● గుండారం క్వారీలో మైనింగ్ అధికారుల తనిఖీ
● కంకర నిల్వలు పరిశీలన
● రాత్రివేళల్లో బ్లాస్టింగ్‌లపై ఆరా


క్వారీలో నిల్వచేసిన కంకర

నిజామాబాద్ రూరల్, జనవరి 29: రూరల్ మండల పరిధిలోని క్వారీలపై మైనింగ్ అధికారులు దృష్టి సారించారు. రూరల్ మండల పరిధిలో నాలుగు కంకర క్వారీలున్నాయి. గుండారం గుట్టను ఆనుకుని ఈ క్వారీలను నిర్వహిస్తున్నారు. క్వారీల్లో బ్లాస్టింగ్‌కు అనుమతి లేకున్నా రాత్రి సమయంలో క్వారీ నిర్వాహకులు బ్లాస్టింగ్‌లు జరుపుతున్నారు. స్థానికులు ఎన్నిసార్లు పోలీసులకు, మైనింగ్ అధికారులకు ఫిర్యాదుచేసినా పెద్దగా స్పందించలేదు. తాజాగా మైనింగ్ అధికారులు కంకర క్వారీలను తనిఖీ చేశారు. సోమవారం మండల పరిధిలోని పలు క్వారీలను పరిశీలించారు. గుండారం గ్రామ సర్వేనెంబర్ 984లోని కంకర క్వారీని గనులు భూగర్భ శాఖ అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. క్వారీకి కేటాయించిన హెక్టార్ భూమిలో జరుపుతున్న తవ్వకాలను పరిశీలించారు. క్వారీలో ఉన్న కంకర నిల్వలను రికార్డులను పరిశీలించారు. పరిధికి మించి బ్లాస్టింగ్ చేసి కంకరను సరఫరా చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు అధికారులు తెలిపారు. క్వారీ తనిఖీ వివరాలను జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదించనున్నట్లు గనులు, భూగర్భ శాఖ ఏడీ సత్యనారాయణ తెలిపారు.

కంకర లారీ బోల్తా..

బోధన్‌రూరల్, జనవరి 29 : బోధన్ పట్టణ శివారులోని పెగడాపల్లి రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి కంకరతో వెళుతున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాల య్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కంకరతో వెళుతున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడటంతో జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది.

ఏర్గట్ల కేజీబీవీలో విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు


కేజీబీవీలో విద్యార్థులకు రక్తహీనతపై వివరిస్తున్న వైద్య సిబ్బంది

ఏర్గట్ల, జనవరి 29: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం అనిమియా ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి ఐరన్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ ప్రసన్న ప్రియ విద్యార్థుతో మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రాజేశ్వర్, పర్యవేక్షకుడు ఆకుల మారుతి, కేజీబీవీ ఎస్‌వో సంధ్య పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనేమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రక్త హీనత, హెమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. కోటగిరి మైనారిటీ జూనియర్ కళాశాలలో 83మంది విద్యార్థులకు రక్తహీనత, హెమోగ్లోబిన్ పరీక్షలు చేయగా ఒకరికి మాత్రమే హెమోగ్లోబిన్ తక్కువ స్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. నాలుగు రోజుల క్రితం పొతంగల్, కోటగిరి ఉర్దూ మీడియం పాఠశాలలో పరీక్షలు నిర్వహించగా 9మంది విద్యార్థులకు రక్త హీనత ఉన్నట్లు గుర్తించి వారిని ఆయా ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ జయప్రకాష్, ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, సూపర్‌వైజర్ జ్యోతి, ఆరోగ్య సిబ్బంది సావిత్రి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ

రెంజల్,జనవరి29: ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కాలమానిని రెంజల్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సోమవారం మండల అధ్యక్షురాలు సుజాత ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీబీవీలో పని చేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్‌కు కనీస వేతనాలు అమలు రావడం లేదని, వీరికి పీఎఫ్, ఈఎస్ఐ, ఆరోగ్య, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని వారన్నారు. జీవో నెంబర్ 60ని అమలు చేయాలని, పని భారం పెరిగిన ఖాళీలు భర్తీ చేయడం లేదని కనీస వేతన అమలు చట్టాన్ని అమలు చేసి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి భారతి, సహాయ కార్యదర్శి, కోశాధికారితదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పీఆర్ భవన్‌లో సోమవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి 327విద్యుత్ యూనియన్, పీఆర్‌టీయూ క్యాలెండర్‌లు, డైరీలను ఆవిష్కరించారు.

నేడు ఆర్మూర్ మండల సర్వసభ్య సమావేశం

ఆర్మూర్‌రూరల్, జనవరి29: ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఎంపీపీ పస్కనర్సయ్య అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి సకాలంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు కావాలని ఆయన తెలిపారు.

విద్యుత్ అధికారిని దుర్భాషలాడిన వ్యక్తిపై ఫిర్యాదు

నవీపేట,జనవరి29: మండల కేంద్రంలోని బావర్చి హోటల్ నిర్వాహకుడు ఇంద్రకరణ్‌పై నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని ట్రాన్స్‌కో ఏఏఈ ప్రవీణ్ కుమార్ తెలిపారు. హోటల్‌తో పాటు తన ఇంటికి సంబంధించిన విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో సోమవారం లైన్‌మేన్ కృష్ణ విద్యుత్ సరఫరాను నిలిపివేయగా ఫోన్‌లో ఇంద్రకరణ్ లైన్‌మెన్‌ను దుర్భాషలాడుతూ దూషించాడని అన్నారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏడీఏ సుహాసినితో పాటు ట్రాన్స్‌కో సిబ్బంది కలిసి నవీపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈవిషయంపై ఇంద్రకరణ్‌పై లైన్‌మెన్ కృష్ణ ఫిర్యాదు చేసినట్లు ఏఏఈ పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్ఐ యాదగిరి గౌడ్‌ను వివరణ కోరగా ట్రాన్స్‌కో లైన్‌మేన్ ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నామని అన్నారు

కాంగ్రెస్‌లో చేరిన డిచ్‌పల్లి సొసైటీ డైరెక్టర్‌లు

డిచ్‌పల్లి,జనవరి 29:డిచ్‌పల్లి సహకార సంఘం డైరెక్టర్‌లు సతీష్‌రెడ్డి (ఘన్‌పూర్),గంగారెడ్డి(దూస్‌గాం)లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేశ్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే నెల 7న డిచ్‌పల్లి సొసైటీ అధ్యక్షుడిపై అవిశ్వాస తీర్మానం ఉన్న నేపథ్యంలో డైరెక్టర్‌లు కాంగ్రెస్‌లో చేరడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కంచెట్టి గంగా ధర్, పొలసానిశ్రీనివాస్,రాంచందర్‌గౌడ్,మధుసుదన్, గంగారెడ్డి, పాల్గొన్నారు.

అరుదైన ఆపరేషన్ చేసిన వైద్యులకు సన్మానం


వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

పెద్దబజార్, జనవరి 29 :జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్ చేసిన వైద్యులను మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన ఇర్ఫాన బేగం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్, గైనాకలిస్టు డాక్టర్ అపర్ణలను ఘనంగా సన్మానించారు.సోమవారం ఆమెకు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు యోజినాల్ ఇస్ట్రెక్టమి అనే క్లిష్టమైన గర్భాశయ సంబంధిత శస్త్ర చికిత్సను కడుపుపై ఎటువంటి కోతలేకుండా విజయవంతంగా ఆపరేషన్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెరుగుతోందని ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తూ ఉంటే మరింత ప్రజలకు మంచి చేసే అవకాశం ఉంటుందన్నారు. వైద్య బృందానికి డాక్టర్ ప్రతిమరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

నందిపేటలో మల్లెపూల నరేందర్ వర్ధంతి

నందిపేట, జనవరి29: నందిపేట మండల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మల్లాపూల నరేందర్ 33వ వర్ధంతిని నిర్వహించారు. 33ఏళ్ళ క్రితం పోలీసులు, నక్సల్స్ మధ్య జరిగిన కాల్పుల్లో నరేంధర్ మృతి చెందారు. ఈ సందర్భంగా ఏఐటీకెఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ జర్నలిస్టుగా పని చేస్తూ ప్రజల కోసం, ప్రజా సంక్షేమం కోసం నరేంధర్ వార్తలు సేకరించి వారికి న్యాయం జరిగేలా చూసేవాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాజలింగం, అనంత్ రావు, దేవన్న, వంజరి గంగాధర్, స్వప్న, లత, తదితరులు పాల్గొన్నారు.

వైస్‌చైర్మన్‌ను ఇన్‌చార్జీ చైర్‌పర్సన్‌గా ప్రకటించాలి


ఆర్మూర్ అంబేద్కర్‌చౌరస్తా వద్ద దీక్ష చేస్తున్న ముస్లీం మైనారిటీ నాయకులు

పెర్కిట్, జనవరి29: ఆర్మూర్ మున్సిపల్ ఇన్‌చార్జీ చైర్‌పర్సన్‌గా వైస్ చైర్మన్ షేక్ మున్నను ప్రకటించాలని సోమవారం పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద మైనారిటీ నాయకులు దీక్ష చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లీం మైనారిటీలను వ్యతిరేకిస్తూ మైనారిటీలు వైస్‌చైర్మన్ షేక్ మున్నను ఇన్‌చార్జీ చైర్‌పర్సన్‌గా ప్రకటించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు ఇంతియాజ్, నాయకులు ముస్లీం మైనారిటీ నాయ కులు పాల్గొన్నారు.

దొంచందలో విద్యుదాఘాతంతో గేదెల మృతి

ఏర్గట్ల, జనవరి 29: మండలంలోని దొంచంద గ్రామంలో సోమవారం విద్యుత్ షాక్ తగిలి రెండు గేదెలు మృతి చెందాయి. గోదావరి తీరం వద్ద మేతకు వెళ్ళిన గేదెలు అక్కడ ఏర్పాటు చేసుకున్న మోటార్‌లకు తగలడంతో విద్యుదాఘాతంతో నీట మునిగి మృతి చెందినట్లు బాధితులు రవిరేకుల శ్రీనివాస్, మేకల శరీన్‌లు తెలి పారు. ఒక్కో గేదె 50 వేలు ఉంటుందని. రెండు గేదెల విలువ సుమారు రూ. లక్షల ఉంటుందని ప్రభుత్వపరంగా నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.


దొంచందలో మృతి చెందిన గేదెలు



గడికోటలో వస్తువులను పరిశీలిస్తున్న విదేశీయులు

కోటను సందర్శించిన విదేశీయులు

దోమకొండ, జనవరి 29: దోమకొండ గడికోటను విదేశీయుల బృందం సోమవారం సందర్శించింది. కోటలో ఏర్పాటు చేసిన వివిధ రకాల వస్తువులను పరిశీలించారు. ట్రస్ట్ ప్రజలకు చేపడుతున్న కార్యక్రమాలను వారికి ట్రస్ట్ మేనేజర్ బాబ్జి వివరించారు. అనంతరం కోటలోని అద్దాల బంగ్లా, రాజభవనం, శివాలయం, చుట్టూ కందకం పరిశీలించారు. కోటలోని అందాలను తిలకించి వాటి చరిత్రను తెలుసుకున్నారు. ట్రస్ట్ చేపడుతున్న కార్యక్రమాలు భేష్ అని వారు కొనియాడారు. కార్యక్రమంలో కామినేని అనిల్ కుమార్, శోభన, గడి సిబ్బంది, గణేష్, మనోజ్, లచ్చిరెడ్డి, రాజశేఖర్, వెంకటలక్ష్మి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ముగ్గురు వైద్యుల రాజీనామా

కామారెడ్డిటౌన్, జనవరి29: జిల్లాకేంద్ర ఆసుపత్రిలో ముగ్గురు వైద్యులు రిజైన్ చేశారు. జిల్లాకేంద్రంలోని దేవునిపల్లిలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడంతో ఆ కళాశాల అనుబంధ ఆసుపత్రిగా జిల్లాకేంద్ర ఆసుపత్రిని చేశారు. గతంలో వైద్యవిధాన పరిషత్ పరిధిలో ఆసుపత్రి ఉన్న సమయంలో సదరు వైద్యులు శిల్ప అనెస్థీషియా, ప్రవీణ్ ఉపిరితిత్తుల నిపుణులు, సాయిలు జనరల్ మెడిసన్ ఐసీయూలో విధులు నిర్వహించేవారు. వారికి ఒక్కొకరికి రూ.లక్షకు పైగా నెల వేతనం అందించేవారు. అయితే ప్రస్తుతం డీఎంఎ పరిధిలోకి మారడంతో వారి వేతనాన్ని రూ.52 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో వేతనం తక్కువగా వస్తుందని వారు ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్‌లో చేరిన 24వ వార్డు కౌన్సిలర్ భర్త

కామారెడ్డి టౌన్, జనవరి 29: కామారెడ్డి మున్సిపల్‌లోని 24వ వార్డు కౌన్సిలర్ ఇల్లెందుల లత భర్త వేణుగుప్తా కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'దేవాదాయ శాఖ దుకాణ సముదాయాలను స్వాధీనం చేసుకోవడం అభినందనీయం'

మాచారెడ్డి, జనవరి 29: మాచారెడ్డి ఎక్స్‌రోడ్డులో గల శ్రీ వీరాంజనేయ వేంకటేశ్వరస్వామి దేవస్థానం దుకాణ సముదాయాలను దేవాదాయశాఖ స్వాధీనం చేసుకోవడం అభినందనీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. అలాగే గతంలో దేవాదాయ సముదాయంలో అక్రమంగా ఉంటూ, వాటి డబ్బులు దేవాలయానికి చెందకుండా వారి సొంత ఆస్తులుగా భావించడంతోపాటు ఆదాయం అనుభవించిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు డబ్బులను రికవరీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి, జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడు నౌసిలాల్, బ్రహ్మానందరెడ్డి, భాస్కర్‌గౌడ్, బన్సిలాల్, నవీన్‌గౌడ్, పూలరాజు, శ్రీనివాస్, రమేష్, బాలనర్సాగౌడ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచడానికే
విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు

కామారెడ్డిటౌన్, జనవరి 29: విద్యా ప్రమాణాలను పెంచడానికి, ఆపై చదువుల కోసం వారురాసే వివిధ పోటీ పరీక్షలు రాసేందుకే తెలంగాణ గణితఫోరం ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు గణితంలో గణిత ప్రతిభా పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర కార్య నిర్వహక అధ్యక్షుడు తాడ్వాయి శ్రీనివాస్ తెలిపారు. గణిత శాస్త్రవేత్త రామానుజం జయంతిని పురస్కరించుకుని ప్రతీ ఏడాది పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని ఈనెల 31న తెలంగాణ విశ్వ విద్యాలయంలో రాష్ట్రస్థాయి ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో ప్రతిభ కనభరిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు హాజరుకావాలని కోరారు.

బిల్లులు చెల్లించాలంటూ రైతుల ఆందోళన

తాడ్వాయి, జనవరి 29: మండలంలోని ఎర్రపహాడ్ గ్రామంలో సోమవారం రైతులు ఎల్లారెడ్డి-కామారెడ్డి రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమకు పాల బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమవుతుందని, వెంటనే పాల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమకు మూడు బిల్లులు రావాల్సి ఉందని, బిల్లులు రాకపోవడంతో గేదెలకు, ఆవులకు దాణా తీసుకురావడం ఇబ్బందిగా మారిందని తెలిపారు. డిసెంబరు, జనవరి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి పాల బిల్లులు సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బీఎంసీ అధ్యక్షుడు నరసింహరెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై కూర్చొని రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు

మద్నూర్, జనవరి 29: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు అన్నారు. మండలంలోని కొడిచిర గ్రామంలో రూ.22లక్షల వ్యయంతో నిర్మించిన రైతు వేదిక భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలతో వ్యవసాయంలో ఆధునీక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని అన్నారు. జాతీయ రహదారి నుంచి చిన్నఎక్లారా, కొడిచిర నిర్మాణానికి కొన్ని అడ్డంకులున్నాయని, వాటిని వీలైనంత త్వరగా తొలగించి పనులు ప్రార ంభిస్తామన్నారు. కొడిచిరలో పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పొలాలకు వెళ్లే రైతుల కోసం సీసీ రోడ్డు వేయించాలని గ్రా మస్థులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. నిధులు వెచ్చించడానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. అనంతరం గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన మంచినీటి ట్యాంకును ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ సంగమేశ్వర్, స్థానిక సర్పంచ్ సంతోష్ పటేల్, కాంగ్రెస్ నాయకులు రమేష్ పటేల్, హన్మంత్ యాదవ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



రైతు వేదిక ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జీపీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

పెద్దకొడప్‌గల్: మండలంలోని లాడేగాంలో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు ప్రారంభించారు. గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కస్తామని ఆయన తెలిపారు. అనంతరం గ్రామంలో టీటీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం అక్కడి నుంచి గుండూర్ చేరుకున్న ఎమ్మెల్యే గ్రామంలో అంగన్‌వాడీ, బస్సుషెల్టర్, పౌరసేవాకేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో లాడేగాం సర్పంచ్ అశ్విని పాటిల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాదారావ్‌పటేల్, ఏడ్గి సర్పంచ్ వినోద్ పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్య ధోరణిని వీడాలి

అధికారులు నిర్లక్ష్య ధోరణిని వీడాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ పేర్కొన్నారు. సోమవారం జుక్కల్ మండల సర్వసభ్య సమావేశం సుర్నార్ యశోద అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై సభను ఉద్దేశించి మాట్లాడారు. శాఖలకు చెందిన అధికా రులు తమ నివేదిక ఎంపీడీవోకు ఇవ్వకపో వడం శోచనీయమని తెలిపారు. అధికారులు తమ పద్ధతి మార్చుకోవాలని, కార్యక్రమంలో జెడ్పీటీసి లక్ష్మీబాయి, తహసీల్దార్ గంగ సాగర్, ఎంపిడివో నరేష్, వైస్ ఎంపీపీ ఉమాకాంత్, సహకార సంఘం అధ్యక్షులు శివానంద్, వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

గాంధారి, జనవరి 29: మండల కేంద్రంలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజ కవర్గస్థాయి ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా మాజీ డీసీసీబీ చైర్మన్ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రోత్సహించేం దుకు బాగారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఎల్లప్పుడు ముందు ఉంటుందని తెలిపారు. విజేతలుగా నిలిచిన మొదటివిజేతకు రూ.30వేలు, రెండో విజేతకు రూ.20వేలు, మూడో విజేతకు రూ.10వేలు బహుమతిగా అందజేయనున్నారు. రానున్న రోజుల్లో వాలీబాల్ క్రీడల్లో జహీరాబాద్ పార్లమెంట్ నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 40 టీమ్స్ పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

శ్రీసీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు

బాన్సువాడటౌన్, జనవరి 29: పట్టణంలోని శ్రీరామ కాలనీలో గల శ్రీరామ ఆలయంలో అర్చకులు మధుసూధనశర్మ శ్రీసీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు ,అర్చనలు చేపట్టారు. భక్తులు సమర్పించిన నూతన వస్త్రాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులున్నారు.

లింగంపేట ఎస్సైగా చైతన్యకుమార్‌రెడ్డి

లింగంపేట, జనవరి29: లింగంపేట ఎస్సైగా గోలి చైతన్యకుమార్‌రెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఆయన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ నుంచి బదిలీపై లింగంపేట పీఎస్‌కు వస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై ప్రభాకర్ బదిలీ అయ్యారు. త్వరలోనే బాధ్యతలు స్వీకరించ నున్ననట్లు తెలిసింది.

ముగ్గురు వ్యక్తుల బైండోవర్

కామారెడ్డిటౌన్, జనవరి 29: కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న ముప్పిల రాజేశ్వర్‌రెడ్డి, కళ్లెం భగవాన్, రావుల రాజేష్ ముగ్గురు వ్యక్తులను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు కామారెడ్డి ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ ముగ్గురు వ్యక్తులు కామారెడ్డిలో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో వారిని గుర్తించి బైండోవర్ చేసినట్లు తెలిపారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు గురుకుల పాఠశాల విద్యార్థి ఎంపిక

బీర్కూర్, జనవరి29: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా గురుకుల పాఠశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సర్థార్ అనే విద్యార్థి జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ప్రస్తుతం ఈ పోటీలు మధ్యప్రదేశ్‌లో జరుగుతున్నాయి. కాగా సర్థార్ ఈ పోటీల్లో పాల్గొన్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఎంపికైన సర్దార్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఇంగ్లీష్ పరీక్షల్లో ఎర్రపహాడ్ విద్యార్థుల ప్రతిభ

తాడ్వాయి, జనవరి 29: తాడ్వాయి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్పెల్ విజర్డ్ కాంపిటిషన్‌లో ఎర్రపహాడ్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనభరిచారు. ప్రథమ, ద్వితీయ బహుమతులు విద్యార్థులు గంగోత్రి, నిషాత్ పర్వీన్‌లు గెలుచుకున్నారు.

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

దోమకొండ, జనవరి 29: వాహనం నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని పోలీసు కళాబృందం సభ్యులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శివరాంమందిర్ ఆలయం వద్ద ఎస్సై మురళి ఆధ్వర్యంలో పోలీసు కళాబృందం టీం సభ్యులు అవగాహన కల్పించారు. పాట పాడి హెల్మెట్ ధరించకుంటే జరిగే నష్టాలను వివరించారు. ఎస్సై మాట్లాడుతూ.. పిల్లలకు బైక్ ఇవ్వకూడదని, 18 సంవత్సరాలు నిండిన తర్వాత వాహనాలు పడపాలని సూచించారు. లైసెన్స్ పత్రాలు వెంట తీసుకెళ్లాన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి, సర్పంచ్ నల్లవు అంజలి, శ్రీనివాస్, కళాబృందం పోలీసులుశేషారావు, సాయిలు, రవి, దోమకొండ పోలీసులు శ్రీధర్, కిరణ్, సామ్రాట్, చంద్రకాంత్, స్వామి, స్వప్న, రాజమణి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసు కళాబృందం



మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మత్స్యకారులకు శిక్షణ

నిజాంసాగర్, జనవరి 29: మండలంలోని అచ్చంపేట రైతు వేదిక వద్ద సోమవారం నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ), ఇండియన్ ఇమ్యూనాలజీ లిమిటెడ్ సీఎస్ఆర్ ప్రాజెక్టు కింద మత్స్యకారులకు శిక్షణ నిర్వహించారు. మత్స్యకారులకు ప్రాణ రక్షణ, నైపుణ్యాలపై శిక్షణ, అవగాహన కల్పించారు. చేపల వేటలో సాధారణంగా జరిగే ప్రమాదాల నుంచికాపాడటం, ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహేష్, పూర్ణ చందర్ రావు, కంచి బార్గవి, మత్స్యకారులు తదితరులున్నారు.

స్థలం కబ్జా చేశారని తహసీల్దార్‌కు ఫిర్యాదు

మద్నూర్, జనవరి 29: మండల కేంద్రంలో 6 ఎకరాల 12 గుంటల భూమిని కబ్జా చేసుకున్న ఇంటి యజమానిపై చర్యలు తీసుకోవాలని బీఎల్‌పీ (బహుజన్ సమాజ్‌పార్టీ) అధ్యక్షుడు నగేష్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలో 584 సర్వే నెంబర్‌లో 3 ఎకరాల 11 గుంటల భూమి, 384/ఎ సర్వే నెంబర్ 3ఎకరాల భూమిని మండల కేంద్రానికి చెందిన ఇల్లు యజమాని కబ్జా చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ఈ విషయమై ఆర్డీవోకు ఫిర్యాదు చేశామని, అప్పట్లోనే ఆర్డీవో విచారణ చేపట్టి జాలీ బైనామా చేసుకున్నట్లు నిరూపించారని, దీనిపై కోర్టుకు వెళ్లినట్లు వెల్లడించారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

లింగంపేట, జనవరి 29: పేదోడి గృహ నిర్మాణానికి మొదటి జీతం విరాళంగా ప్రకటించిన ఎమ్మెల్యే మదన్‌మోహన్ చిత్రపటానికి సోమవారం కాంగ్రెస్ కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల హామీలో భాగంగా గాంధారి మండలంలోని సర్వాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటి ఇటీవల మృతి చెందడంతో అతని కుటుంబాన్ని పరమర్శించిన ఎమ్మెల్యే అతనికి స్వంత ఇల్లు లేకపోవడంతో అతని కుటుంబానికి బాసటగా నిలిచేందుకు ఆదివారం తన మొదటి జీతానికి మరికొంత డబ్బు కలిపి సొంత ఇంటిని నిర్మించి ఇస్తానని ప్రకటించడంతో లింగంపేట మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలు మదన్ మోహన్‌రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజి వైస్ చైర్మన్ బుర్ర నారాగౌడ్, నాయకులు రామాగౌడ్, భైరయ్య, జక్సాని రవి, ఎల్లమయ్య, సాజీద్, కుద్దూస్, పాషా, ఫతియొద్దీన్, జొన్నల రాజు, ఇబ్రహీంలతో పాటు నాయకులు ఉన్నారు.



వైకుంఠధామాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు

వడ్డేపల్లిలో వైకుంఠ ధామం ప్రారంభం

నిజాంసాగర్, జనవరి 29: మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన వైకుంఠ ధామాన్ని సోమవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో అభివృద్ధిలో దూసుకుపోతుందని, అనేక రకాల పథకాల వల్ల అభివృద్ధి అన్ని విభాగాల్లో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్య రాణి పండరి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

విరాళం అందజేత

బాన్సువాడ టౌన్, జనవరి 29: పట్టణంలోని పాతబాన్సువాడలో గల శ్రీ వరసిద్ధి వినాయక మందిర అర్చకుడి నెల వేతనం కోసం అప్నాబజార్ యజమాని నటరాజ్ 4వేల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ విరాళం అందజేసిన దాతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎండు గంజాయి స్వాధీనం

నసురుల్లాబాద్, జనవరి 29: మండలంలోని దుర్కిలో పోలీసులు ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు. దుర్కిలో గోగుల సాయిలు అనే వ్యక్తి గంజాయి మొక్కలను పెంచి అమ్ముతున్నాడనే సమాచారం మేరకు ఆదివారం తనిఖీలు చేపట్టి 1.190 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

స్టాఫ్ నర్స్‌కు ఎంపిక

పెద్ద కొడప్‌గల్, జనవరి 29: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన స్టాఫ్‌నర్స్ ఫలితాల్లో జుక్కల్ మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శోభ ఎంపిక అయింది. జుక్కల్ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో 13 ఏళ్లుగా పని చేస్తున్న శోభ ఎంపిక కావడంతో తోటి ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్లారెడ్డి ఎమ్మెల్యేను కలిసిన టీడీపీ నేత

బీర్కూర్, జనవరి 29: ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావును సోమవారం నిజామాబాద్ జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు ధన్వశ్రీ రైస్ ఇండస్ట్రీస్ చైర్మన్, కమ్మసత్యనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీమదుశ్రీవాత్సవ

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్య

రామారెడ్డి, జనవరి 29: రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన విద్యను అందిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమదు శ్రీవాత్సవ అన్నారు. సోమవారం రామారెడ్డి గ్రామంలో ప్రభుత్వఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు పదోతరగతిలో మంచి మార్కులు సాధించి కళాశాలలో చేరాలని సూచించారు. కళాశాలలో ఉండే సౌకర్యాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్, అశోక్‌గౌడ్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు కార్పెట్ల పంపిణీ

భిక్కనూరు, జనవరి 29: మండలంలోని బస్వాపూర్ గ్రామప్రాథమిక పాఠశాలకు లంబడి స్వామి యువసేన సభ్యులు సోమవారం కార్పెట్లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం కార్పెట్లను అందజేయడం సంతోషంగా ఉందని, మున్ముందు పాఠశాలలో మరిన్ని కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో యువసేన సభ్యులు ప్రదీప్, బాబు, భూషణం, కిరణ్, ప్రేమ్‌కుమార్, స్వామి, వినయ్, మేకల రవి, పోచయ్య పాల్గొన్నారు.

రేపు డెమో క్లాసులు

బిచ్కుంద, జనవరి 29: బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీకళాశాల (అటానమస్)లో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 31న కళాశాలలో డెమో క్లాస్‌లు నిర్వహించడం జరుగుతుందని చంద్రముఖర్జీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో క్లాస్‌లకు హాజరుకావాలని సూచించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

దోమకొండ, జనవరి 29: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ కానుగంటి శారద అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చిన్నారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు నగదు పురస్కారం

పెద్ద కొడప్‌గల్, జనవరి 29: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సోమవారం సంగారెడ్డి జిల్లా శంకరంపేట్‌లో నేషనల్ హైవే అధికారుల నుంచి నగదుతో పాటు ప్రశంసా పత్రం అందుకున్నారు. పాఠశాలలో గత సంవత్సరం 2022-23 పదో తరగతిలో ఎం. శివ ప్రసాద్ 9.5, డి. చందన 9.2 మార్కులు పొందారు. నేషనల్ హైవే పరిధిలో గల ఉన్నత పాఠశాల విద్యార్థులను ప్రోత్సాహించాలని ఉద్దేశ్యంతో నేషనల్ హైవే అధికారులు ఈ విద్యార్థులకు శంకరం పేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఒక్కొక్క విద్యార్థికి 10 వేల రూపాయల నగదుతో పాటు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు చంద్రకాంత్, కిషన్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బాలిక విన్యాసాలు

పెద్ద కొడప్‌గల్. జనవరి 29: కోటి విద్యలు కూటి కోసమే అన్నట్లుగా కొంత మంది ప్రమాదకరమైన విన్యాసాలు చేస్తున్నారు. సోమవారం పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రానికి వచ్చిన ఓ సర్కస్ వారు రహదారి పక్కన తమ విన్యాసాలు ప్రదర్శించారు. రెండు కట్టెలపై తాడు కట్టి ఆ తాడుపై ఓ పల్లెంపై బాలిక ప్రమాదకరంగా విన్యాసం చేయడం గ్రామస్థులను ఆకట్టుకుంది. కళా ప్రదర్శన ఎలా ఉన్న మాట ఏమో గాని ఒకవేళ బాలిక తాడుపై నుంచి కింద పడితే ఎలా అని ప్రజలు చర్చించుకున్నారు. సర్కస్ అనంతరం చూసిన వారు కొంత కొంత నగదు సహాయం చేశారు.

బీఆర్ఎస్‌కు వీడీసీ చైర్మన్‌రాజీనామా

భిక్కనూరు, జనవరి29: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంకు చెందిన వీడీసీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తక్కళ్ల నర్సారెడ్డి, సీనియర్ నాయకులు రెడ్డిగారి నరేందర్‌రెడ్డి సోమవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కొందరు నేతల ఒంటెద్దు పోకడల వల్లనే బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఓడిపోయారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మండల నాయకులు కొందరు వ్యవహరించిన తీరు మమ్మల్నీ తీవ్రంగా బాధించిందని, వారి తీరు నచ్చకనే బాధతో పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. ఇకముందు ఏ పార్టీలో చేరమని వివరించారు.

అబాకస్ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

మద్నూర్, జనవరి 29: వచ్చేనెల 25న నిర్వహించే రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని సాయి సంస్కృతి ఎంపిక కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో రెండో బహుమతి సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మనోజ్‌తెలిపారు. జిల్లాస్థాయిలో బెస్ట్ ఫర్మార్‌మర్‌గా మచ్కూరీవార్ యాత్ర ఎంపికైనట్లు తెలిపారు.

బీఆర్ఎస్ సమావేశానికి తరలిన నాయకులు

మద్నూర్, జనవరి29: జుక్కల్ నియోజకవర్గం కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి మద్నూర్ సర్పంచ్ దరాస్ సురేష్ ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలివెళ్లారు. పిట్లం మండల కేంద్రంలో విస్తృత స్థాయి సమావేశానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే హాజరయ్యారు. తరలివెళ్లిన వారిలో మాజీ అధ్యక్షుడు హన్మాండ్లు మేస్త్రి, నాయకులు సుభాష్, ఉపసర్పంచ్ విఠల్, టౌన్ అధ్యక్షులు హన్మాండ్లు, రవి కంచెన్‌వార్ పాల్గొన్నారు.